సాక్షి
శ్రీకాకుళం
7
శుక్రవారం । 16 । మే । 2025

న్యూస్‌రీల్

బాపిరాజుపేట అంగన్‌వాడీ సహాయకురాలు తొలగింపు

పొందూరు: బాణాం పంచాయతీ పరిధిలోని బాపిరాజుపేట అంగన్‌వాడీ సహాయకురాలు బి.సుగుణను కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించినట్లు గురువారం సీడీపీఓ ఎస్.అనురాధ తెలిపారు. అంగన్‌వాడీ సహాయకురాలు సుగుణ పదో తరగతి చదవకుండానే తప్పుడు ధ్రువీకరణ పత్రం సమర్పించి ఉద్యోగంలో చేరినట్లు ఆమదాలవలస నియోజకవర్గం స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సువ్వారి గాంధీ, బాపిరాజుపేటకు గ్రామానికి చెందిన సూర కిరణ్‌లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి పదోతరగతి ధ్రువపత్రం సమర్పించాలని సహాయకురాలిని అధికారులు కోరారు. ఆమె సర్టిఫికెట్ చూపించకపోవడంతో ఉద్యోగం నుంచి తొలగించారు.

తడిచిన మొక్కజొన్న



కోమర్తి-యారబాడుల మధ్య రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు

నరసన్నపేట: మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా మొక్కజొన్న రైతులకు అవస్థలు తప్పలేదు. ఎండిన మొక్కజొన్న గింజలు విక్రయానికి సిద్ధంగా ఉంచగా వర్షానికి తడిచిపోయాయి. దీంతో గురువారం మళ్లీ ఎండబెట్టారు. కోమర్తి నుంచి యారబాడు వరకూ కిలో మీటరు పొడవున మొక్కజొన్న గింజలు రోడ్డుపై ఒక భాగంలో ఎండ బెట్టారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల స్వాభిమాన్ వినతులు స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత తెలిపారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు వారి సమస్యలను విన్నవించుకోవాలని సూచించారు.

'దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను, లేబర్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన బిల్డింగ్ కార్మికుల సంక్షేమ నిధిని తిరిగి జమ చేయాలని కోరుతూ మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం డైమండ్ పార్క్ దగ్గర భవన నిర్మాణ కార్మికులకు సమ్మె కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేసి, పోస్టర్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో టీడీపీ కూటమి హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమలుచేయడానికి పూనుకోకపోవడం అన్యాయమన్నారు.

యాత్రికులకు అస్వస్థత

- మృతి చెందిన వృద్ధురాలు



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న యాత్రికులు




మృతి చెందిన ముని లక్ష్మమ్మ

ఇచ్ఛాపురం: తీర్థయాత్రకు బయల్దేరిన చిత్తూరు వాసులకు విషాదం ఎదురైంది. యాత్రికులు అస్వస్థతకు గురి కాగా ఒకరు మృతి చెందారు. చిత్తూరు జిల్లా, పెద్ద పంజాని మండలం పరిధిలో గోనుమాకన్నపల్లితో పాటు మరికొన్ని గ్రామాలకు చెందిన 46 మంది ఓ ప్రైవేటు ట్రావెల్స్ ద్వారా ఈ నెల 8న తీర్థయాత్రలకు బయల్దేరారు. దారిలో స్వయంగా భోజనాలు సిద్ధం చేసుకుని తినేవారు. కాశీ, అయోధ్య దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నెల 13న సాయంత్రం ఒడిశా సమీపించేసరికల్లా వీరిలో 30 మందికి వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గురువారం ఇచ్ఛాపురం చేరుకునేసరికి ఇంకా ఎక్కువ మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో వీరు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేరారు. వీరిలో పిచ్చుగల్లు మునిలక్ష్మమ్మ (69) ఆస్పత్రికి వచ్చేలోపే చనిపోయారని వైద్యులు పి.దేవేంద్రరెడ్డి తెలిపారు. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న వారు కోలుకుంటున్నారు. మృతురాలి సోదరి గంగులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ బి.జగదీశ్వరరావు కేసు నమోదు చేశారు.







సమస్యలకు నిలయం

శ్రీకాకుళం కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న రాజీవ్ గృహ కల్ప వద్ద నివాస సముదాయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇళ్లు ఓ వైపు పెచ్చులూడి భయపెడుతుండగా.. మురుగునీరు పెద్ద ఎత్తున అక్కడే నిల్వ ఉంటూ రోగాలకు కారణమవుతోంది. స్వచ్ఛతపై ప్రకటనల కోసం కోట్లు ఖర్చు పెడుతున్న యంత్రాంగం కలెక్టరేట్ పక్కనే పరిస్థితిని పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

డూప్లికేటుగాళ్లు



ఫిబ్రవరి 14

పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద ఫిబ్రవరి 14వ తేదీన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ నేరుగా తనిఖీలు చేయగా 12 ఇసుక లారీలు నకిలీ బిల్లులతో రవాణా చేస్తున్నట్టుగా గుర్తించారు. బట్టేరు, భైరి, కాఖండ్యాం, గార, ముద్దాడ పేట ఇసుక రీచ్‌ల నుంచి నకిలీ బిల్లులతో రవాణా చేసినట్టుగా నిర్ధారించారు.



మే 12

పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి దాటాక సీఐ అవతారం జరిపిన ఆకస్మిక తనిఖీల్లో 6 ఇసుక లారీలు నకిలీ బిల్లులతో రవాణా సాగిస్తున్నట్టుగా గుర్తించారు. ముద్దాడపేట, అంబళ్లవలస రీచ్‌ల నుంచి కొనుగోలు చేసి, రవాణా చేస్తున్నట్టు బిల్లులు చూపించారు. ఆ బిల్లులను పరిశీలించాక నకిలీవి అని గుర్తించాక మైనింగ్ అధికారులకు అప్పగించారు.



- ఇసుక దందాలో నకిలీ బాగోతం
- నకిలీ బిల్లులతో ఇసుక అక్రమ రవాణా
- ప్రత్యేక పరికరాలతో నకిలీ బిల్లుల సృష్టి
- సొమ్ము చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు
- లోతుగా జరగని విచారణ

గతేడాది అక్టోబర్ 9వ తేదీన రణస్థలం మండలం పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీదేవి ఆకస్మిక తనిఖీలు చేసిన సమయంలో నకిలీ బిల్లులతో ఇసుక రవాణా సాగిస్తున్న లారీలను పట్టుకున్నారు.

నకిలీ బిల్లులపై విచారణేదీ?



జిల్లాలో నాలుగైదు పర్యాయాలు ఆకస్మిక తనిఖీల్లో భాగంగా నకిలీ బిల్లులతో ఇసుక రవాణా చేస్తున్న లారీలు పట్టుబడ్డాయి. జాయింట్ కలెక్టర్ దగ్గరి నుంచి సీఐ స్థాయి అధికారి వరకు నకిలీ బిల్లుల బాగోతాన్ని కళ్లారా చూశారు. దొరికినాక రెండు రోజులు సంబంధిత లారీలను పట్టుకుని, ఆపై మైనింగ్ అధికారులకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. అసలు నకిలీ బిల్లుల సృష్టికర్త ఎవరు? ఎక్కడి నుంచి నకిలీ బిల్లులు వస్తున్నాయి? ఏ డివైజ్ నుంచి నకిలీ బిల్లులు సృష్టించారు? ప్రభుత్వం జారీ చేసిన బిల్లుల మాదిరిగా నకిలీ బిల్లులు ఉండటం వెనక కారణమేంటి? దీనికంతటికీ వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ ఏమిటీ? ఇలా లోతుగా విచారణ చేసిన దాఖలాలు కనిపించలేదు. దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుండగా.. అక్రమార్కులు రూ.వందల కోట్లు వెనకేసుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో ఇసుక అక్రమ వ్యాపారం కొత్త పుంతలు తొక్కుతోంది. ఇదివరకు నదులను గుల్ల చేసి దొంగతనంగా ఇసుక తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ బిల్లులను పోలిన బిల్లులను వారే ముద్రించుకుని దర్జాగా జిల్లా సరిహద్దు దాటిస్తున్నారు. అధికారులు బార్ కోడ్ యాప్‌లో నకిలీ బిల్లులను స్కాన్ చేస్తే వాటి గుట్టు రట్టు అవుతోంది. అధికారుల వద్ద ఉన్న లాగిన్‌లోకి వెళ్తే తప్ప నకిలీ బిల్లులు బయటపడవు. అధికారుల తనిఖీ చేసే సమయంలో మాత్రమే బయటపడుతున్నాయి. మిగతా సమయాల్లో చెక్ పోస్టు వద్ద లాగిన్, బార్ కోడ్ స్కాన్ చేసే సదుపాయం లేకపోవడంతో నకిలీలను సిబ్బంది గుర్తించలేకపోతున్నారు.

దొరికితేనే దొంగ..

అధికారికంగా నాలుగైదు సార్లు నకిలీ బిల్లులతో ఇసుక రవాణా చేస్తున్న లారీలు పట్టుబడ్డాయి. అనధికారికంగా ఎన్ని వేల లారీలు తరలివెళ్లిపోతున్నాయో తెలియని పరిస్థితి ఉంది. జిల్లాలోని వంశధార, నాగావళి, బాహుద తదితర నదుల్లో ఎక్కడికక్కడ పాలకపక్ష నాయకులు అక్రమంగా రీచ్‌లు తెరిచారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు సైతం చూసీ చూడనట్టు వదిలేస్తుండటంతో అనుమతులతో సంబంధం లేకుండా, వంతెనలు, మంచినీటి వనరుల ముప్పుతో సంబంధం లేకుండా దొరికిన కాడికి తవ్వేసి తరలించేస్తున్నారు. ఒక్కో లారీకి పీక్ సీజన్‌లో రూ.25వేల వరకు వసూలు చేయగా, మిగతా సమయాల్లో రూ.15 వేల నుంచి రూ.18వేలు వరకు లాగేస్తున్నారు. అధికారిక ర్యాంపుల వద్ద ఇసుక అందుబాటులో లేకపోవడం, సరిపడా ఇసుక సరఫరా చేయకపోవడంతో వినియోగదారులు కూడా తప్పని పరిస్థితుల్లో అనధికార ర్యాంపులను ఆశ్రయిస్తున్నారు. విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాలతో పాటు మన జిల్లాకు చెందిన లారీ యజమానులతో ర్యాంపుల నిర్వాహకులు నేరుగా సంబంధాలు పెట్టుకుని, నీకింత నాకింత అని పర్సంటేజీలు ఫిక్స్ చేసుకుని ఇసుక విక్రయిస్తున్నారు. రోజుకి వేల లారీలు జిల్లాను దాటి వెళ్లిపోతున్నాయి.



పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద ఆకస్మిక తనిఖీల్లో గుర్తించిన నకిలీ బిల్లులు


ఇసుక అక్రమాల్లో మరో అవినీతి కోణం..

అనుమతి లేని తవ్వకాలు, అక్రమ రవాణా పక్కన పెడితే నకిలీ బిల్లులతో లారీల్లో ఇసుకను తరలించడమే మరో అవినీతి కోణంగా చెప్పుకోవాలి. అధికారికంగా ఎవరికైనా ఇసుక కావాలంటే సంబంధిత ర్యాంపులకు సంబంధించి చెల్లింపులు చేసి రశీదులు తీసుకోవాలి. ప్రభుత్వం నిర్దేశించిన సాఫ్ట్‌వేర్‌లో యంత్రాంగం రూపొందించిన డివైజ్‌తో బిల్లులు జారీ చేస్తారు. కానీ గత కొన్ని నెలలుగా జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం జారీ చేసిన బిల్లులను పోలిన బిల్లులను రీచ్‌ల అక్రమ నిర్వాహకులు సృష్టిస్తున్నారు. వాటి కోసం ప్రత్యేక డివైజ్‌లను సమకూర్చుకున్నారు. ప్రభుత్వం యంత్రాంగం వద్ద ఉండాల్సిన సాఫ్ట్‌వేర్‌ను సైతం తమ డివైజ్‌లకు అప్‌లోడ్ చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఇలాంటి అక్రమ పద్ధతిలో డూప్లికేట్ బిల్లులు సృష్టిస్తున్నారు. వాటి ద్వారానే దర్జాగా రవాణా చేస్తున్నారు. చెక్‌పోస్టులు, ఇతర రహదారి మార్గాల్లో ఎవరైనా సిబ్బంది అడిగితే ఆ బిల్లులు చూపించి జిల్లాను దాటించేస్తున్నారు. పక్కా వివరాలతో ఉండే అధికారులు తనిఖీ చేస్తే మాత్రం నకిలీ బిల్లుల గుట్టు రట్టు అవుతోంది.

అపార్ట్‌మెంట్ పనులు ఆపండి



సాక్షిలో ప్రచురితమైన కథనం



తాజాగా సుడా ఇచ్చిన ఆర్డర్



నరసన్నపేట:స్థానిక ఇందిరా నగర్‌లో కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి జరుగుతున్న పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని సుడా ఉత్తర్వులు జారీ చేసింది. పర్మిట్ నంబర్ 1178/0008/బీ/ఎన్‌పీ/జీపీ/2025తో ఏప్రిల్ 21న ఇటీవల అపార్ట్‌మెంట్ నిర్మాణానికి శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (సుడా) అనుమతినిస్తూ ఆర్డర్స్ ఇచ్చింది. అయితే ఈ స్థలం వివాదంలో ఉందని, సొసైటీ నిబంధనల మేరకు అపార్ట్‌మెంట్ నిర్మించడానికి వీలు లేదని సొసైటీ పాలక వర్గం వాదిస్తోంది. దీనిపై ఈనెల 14న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సుడా అధికారులు అపార్ట్‌మెంట్ నిర్మాణ పనుల అనుమతికి మరిన్ని డాక్యుమెంట్లు కావాలని, అవి సమర్పించేంత వరకు ఎలాంటి పనులు చేయవద్దని బుధవారం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి అనుమతులు ఇచ్చే వరకూ పనులు కొనసాగించవద్దని సూచించింది.

ఆకట్టుకున్న పప్పెట్రీ



ప్రజా చైతన్య కళా భవన్‌లో ప్రదర్శన

టెక్కలి: టెక్కలి ప్రజా చైతన్య కళా సమితి భవన్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా గురువారం చేపట్టిన పప్పెట్రీ ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు డీఏ స్టాలిన్, ఆర్.వి.రమణమూర్తి, మోహన్ గౌడు ఆధ్వర్యంలో బొమ్మలతో అభినయం చేస్తూ కథలు ప్రదర్శన చేశారు. పులి బంగారం కడియం, మిత్రలాభం-మిత్రభేదం తదితర పంచతంత్ర కథలను ప్రదర్శన ద్వారా పిల్లలకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎం.పద్మనాభరావు, గణపతిరావు, ఎం.తాతయ్య, పి.హరిశ్చంద్రరావు, టి.భాస్కరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఏపీఈసెట్ ఫలితాల్లో
సిక్కోలు జోరు

- 1621 మంది పరీక్ష రాయగా 92.97 శాతంతో 1507 మందికి అర్హత
- ఈసారి బాలికలదే పైచేయి

శ్రీకాకుళం న్యూకాలనీ/ గార/కంచిలి/ శ్రీకాకుళం రూరల్/ సోంపేట/ జలుమూరు/సారవకోట/ బూర్జ: ఏపీఈసెట్-2025 ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. జేఎన్‌టీయూ అనంతపురం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఏపీఈసెట్ ఫలితాలు గురువారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించారు.

92.97 శాతం మంది అర్హత..

పునర్విభజన శ్రీకాకుళం జిల్లా ఏపీఈసెట్-2025 ఫలితాల్లో 92.97 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి 1671 మంది దరఖాస్తు చేసుకోగా.. 1621 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 92.97 శాతం ఉత్తీర్ణతతో 1507 మంది అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో బాలురు 1049 మంది, బాలికలు 458 మంది ఉన్నారు. బాలురు91.94శాతం అర్హత సాధించగా, బాలికలు 95.42 శాతం మంది అర్హత సాధించి మరోసారి బెటర్ అనిపించారు.



వివిధ కోర్సుల్లో టాపర్లు వీరే..



1 - అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగంలో జిల్లాలోని గార మండలం అంపోలుకు చెందిన డి.నళిని 112 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచారు. ఆమె తండ్రి శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు అంతా వ్యవసాయదారులే. తాను భవిష్యత్‌లో వ్యవసాయ శాస్త్రవేత్త అవుతానని ఆమె తెలిపారు.



1 - బయోటెక్నాలజీ విభాగంలో సోంపేట బనిసెట్టి వీధికి చెందిన దాసరి భవానీ శంకర్ 53 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచారు. తల్లిదండ్రులు దాసరి కృష్ణారావు, గోపి. విద్యార్థి డిప్లమో పూర్తి చేసి విశాఖలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు.



9 - కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో కంచిలి మండలం జాడుపూడి సమీపంలోని బసవపుట్టుగకు చెందిన కె.శరత్ కుమార్ 164 మార్కులతో స్టేట్ 9వ ర్యాంకు సాధించాడు. తండ్రి కంఢ్రెడ్డి రాజారావు ఎలక్ట్రీషియన్, తల్లి ఢిల్లమ్మ గృహిణి.



6 - ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో బూర్జ మండలం కంతలాంకు చెందిన కింజరాపు ప్రతాప్ 149 మార్కులతో స్టేట్ 6వ ర్యాంకు సాధించాడు. తండ్రి మురళి మృతి చెందడంతో తల్లి లత వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ చదివించారు.



8 - ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో బూర్జ మండలం పెద్దపేటకు చెందిన వి.మనోజ్‌కుమార్ 148 మార్కులు సాధించి స్టేట్‌లో 8వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. తండ్రి అనంతరావు వ్యవసాయ కూలి, తల్లి దశరత్నం గృహిణి.



9 - అదే విభాగంలో శ్రీకాకుళం రూరల్ మండలం వప్పంగిలోని గొండువీధికి చెందిన గొండు భానుప్రసాద్ 147 మార్కులతో 9వ ర్యాంకు సాధించాడు.



2 - ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ విభాగంలో పొందూరు మండలం గోకర్నపల్లికి చెందిన శీపాన హేమప్రియ 101 మార్కులు సాధించి స్టేట్ 2వ ర్యాంకుతో సత్తాచాటింది. ఈమె తల్లి సీపాన జ్యోతి టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తండ్రి ప్రభాకరరావు మృతి చెందారు.



7 - అదే విభాగంలో సారవకోట మండలం నౌతలలోని పెద్దవీధికి చెందిన ఆర్.హేమలత 91 మార్కులతో స్టేట్ 7వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు సుధారాణి, డిల్లేశ్వరరావులు కూలి పనులు చేసుకుంటూ కుమార్తెను చదివించారు.



10 - జలుమూరు మండలం గొటివాడ గ్రామానికి చెందిన గురువు బాలకృష్ణ ఈసెట్‌లో మెకానికల్ విభాగంలో పదో ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు గౌరమ్మ, శ్రీనివాసరావులు వ్యవసాయ కూలీలు.



3 - ఫార్మసీ విభాగంలో ఆమదాలవలసలోని ఐజే నాయుడుకాలనీకి చెందిన కూన భార్గవి 109 మార్కులతో స్టేట్ 3వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించింది. తండ్రి నర్సింగరావు సాధారణ పనులు చేస్తూ పువ్వుల వ్యాపారం చేస్తుంటారు. తల్లి రమణమ్మ గృహిణి. ఈమె పెళ్లి చేసుకున్నాక చదువు కొనసాగిస్తున్నారు. ర్యాంకు సాధించేందుకు భర్త రమేష్‌కుమార్, అత్తమామలు సహకారం అందించారని తెలిపారు.

తాళి కట్టిన శుభవేళ..



అవయవదాన ప్రమాణ పత్రాలు చూపిస్తున్న వధూవరులు, కుటుంబ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: తాళి కట్టిన శుభవేళ ఆ దంపతులు, పెళ్లి పెద్దలు ఓ అపురూప నిర్ణయం తీసుకున్నారు. అవయవదానానికి అంగీకారం తెలుపుతూ 60 మంది వరకు ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ ఆదర్శ నిర్ణయాన్ని ఇరు వర్గాల పెద్దలు అభినందించారు. జరజాం సమీపంలోని ప్రైవేటు రిసార్ట్‌లో విజయ నగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయ వలసకు చెందిన బాలి శ్రీనివాసరావు, లావేరు మండలం కేశవరాయనిపాలెంకు చెందిన ప్రియాంకకు గురువారం వివాహం జరిగింది. పెళ్లి రోజు మంచి పనికి శ్రీకారం చుట్టాలని తలచారు. ఈ మేరకు చీపురుపల్లి గ్రామానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ బీవీ గోవింద్ సలహాతో అవయవదానానికి అంగీకారం తెలుపుతూ ప్రమాణ పత్రాలు సమర్పించారు.

క్లుప్తంగా

ముగిసిన పీజీ సెట్ దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఏపీ పీజీ సెట్ -2025 దరఖాస్తులు స్వీకరణ గడువు ముగిసింది. మార్చి 31న నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. రూ. 2000 అదనపు రుసుముతో ఈ నెల 20 వరకు, రూ. 4000 అదనపు రుసుముతో 24 వరకు, రూ.10,000 అదనపు రుసుముతో 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీరిస్తారు. మే 30 నుంచి హాల్ టికెట్లు అందుబాటులో ఉంచుతారు. జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలు కూడా ఏపీ పీజీసెట్ - 2025 ద్వారానే నిర్వహిస్తారు.

నేడు డెంగీ అవగాహన ర్యాలీ

అరసవల్లి: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా నివారణాధికారి పి.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిత బృందం ఈ ర్యాలీని ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఏడు రోడ్ల కూడలిలో ప్రతిజ్ఞ అనంతరం కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.

రైలు ఢీకొని ఆవు మృతి



ఊడిపడిన రైలు ఇంజిన్‌లోని ఓ భాగం

టెక్కలి రూరల్: స్థానిక తెంబూర్ రోడ్డులో రైల్వే గేటు సమీపంలో గురువారం రైలు ఢీకొని ఆవు మృతిచెందింది. గుణ్‌పూర్ నుంచి పూరి వైపు వెళ్తున్న రైలు టెక్కలి సమీపంలోకి వచ్చేసరికి పట్టాలపైకి ఆవు రావడంతో ఈడ్చుకుపోయింది. ఈ క్రమంలో ట్రైన్ ఇంజిన్‌కు చెందిన కొన్ని భాగాలు సైతం విరిగి పడ్డాయి. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు.

టెక్కలి ఎంజేపీ విద్యార్థినికి ప్రశంసలు



అవార్డు అందుకుంటున్న నవ్య

టెక్కలి: టెక్కలి ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాలకు చెందిన జె.నవ్య ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 590 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా గురువారం విజయవాడలో జరిగిన అభినందన సభలో ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పూసపాటి సుధారాణి తెలిపారు. బీసీ సంక్షేమ శాఖామంత్రి ఎస్.సవిత, ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ, ఎంజేపీ ఏపీ పాఠశాలల సెక్రటరీ మాధవీలత, పూర్వపు సెక్రటరీ కృష్ణమోహన్ తదితరుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు శివచరణ్



శివచరణ్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థి ఎండ శివచరణ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. సీఎస్‌ఈ బ్రాంచ్ మూడో ఏడాది చదువుతున్న శివచరణ్ ఇటీవల విజయనగరం జిల్లా కొండవెలగాడలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ -23 విభాగంలో 67 కిలోల గ్రీకోరోమన్ విభాగంలో ప్రతిభ కనబర్చాడు. దీంతో ఈ నెల 17, 18 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు అర్హత సాధించాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ, యాజమాన్య సభ్యులు గురువారం అభినందించారు.

రైతు రుణాలకు.. ముప్పతిప్పలు



- అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తేనే రెన్యువల్ సాధ్యమంటున్న బ్యాంకర్లు
- రెన్యువల్ కాకుంటే జీరోవడ్డీ దక్కదేమోనని ఆందోళనలో అన్నదాతలు
- కూటమి ప్రభుత్వంలో నిబంధనలపై మండిపాటు



రబీ వరిపైరును యంత్రాలతో కోస్తున్న రైతులు

కవిటి:

ఖరీఫ్ సీజన్ ఆరంభం కాకముందే అన్నదాతకు కష్టాలు మొదలయ్యాయి. పంట రుణాల రెన్యువల్ కోసం బ్యాంకులకు వెళుతున్న రైతులకు ఊహించని షాక్‌లు ఎదురవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం 2024 మార్చి 31 వరకు లేని ఆంక్షలు టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మొదలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా మాదిరిగానేవడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకుందామని బ్యాంకులకు వెళ్లిన రైతులకు అలా కుదరదంటూ బ్యాంకర్లు చెబుతున్నారు. అసలు, వడ్డీ రెండూ కడితేనే రెన్యువల్ చేస్తామని తెగేసి చెబుతున్నారు. దీంతో ఉసూరుమంటూ రైతులు వెనుతిరుగుతున్నారు. గత్యంతరం లేక వడ్డీ వ్యాపారులను అప్పుల కోసం ప్రాధేయపడుతున్నారు. వారం పది రోజులకు నూటికి రూ.3 నుంచి రూ.5ల వరకు వడ్డీకి తీసుకొని ఆ సొమ్మును బ్యాంకులకు కడుతున్నారు. పోనీ కట్టిన వెంటనే డబ్బులు ఇస్తున్నారంటే అది లేదు. బ్యాంకులో ఆ సొమ్ము ఒకరోజు క్రెడిట్‌గా ఉంచాల్సి ఉంటుందని, డబ్బుల కోసం మరుసటి రోజు రావాలని బ్యాంకర్లు సూచిస్తున్నారు. దీనికితోడు రుణం డబ్బులు విత్ డ్రా చేయడానికి చెక్‌బుక్ అవసరమని చెబుతుండడంతో దానికీ తిప్పలు తప్పడం లేదు. బ్యాంకు నుంచి రూ.49,000 పైబడి డబ్బులు తీసుకోవడానికి పాన్‌కార్డు కూడా ఉండాలని చెబుతుండటంతో ఇవేం పాట్లు అంటూ ఆవేదన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 4,10,847 మంది రైతులకు రూ.5246.55 కోట్లు పంట రుణాలుగా అందించాలని లక్ష్యం కాగా రూ.5054కోట్లు మంజూరు చేశారు. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి తీసుకున్న ఈ పంట రుణాల రెన్యువల్ ప్రక్రియలో తీసుకున్న అసలుతో పాటు వడ్డీ రూ.50 కోట్ల వరకు రైతులు చెల్లించాల్సిన పరిస్థితి.

గత ప్రభుత్వంలో సాఫీగా ప్రక్రియ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ప్రతి ఏటా రైతు భరోసా పథకం ఠంచన్‌గా అందేది. పంట రుణాల రెన్యువల్ సమయంలోనూ వడ్డీ కడితే రెన్యువల్ సులభంగా జరిగిపోయేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పంట రుణం గుదిబండగా మారింది. ఏడాది లోపల రెన్యువల్ చేసుకోకపోతే పెనాల్టీ వడ్డీ కట్టుకోవాలి. ఫలితంగా జీరో వడ్డీ పథకం వర్తించదు. దాంతో పాటు సదరు రైతు డిఫాల్టర్‌గా మారి సివిల్ రేటింగ్ దెబ్బతింటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు రుణాల మంజూరు విషయంలో ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

బాధాకరం



రైతుకు మంజూరు చేస్తున్న పంట రుణానికి సంబంధించి ఏడాది లోపు అసలు, వడ్డీ కట్టాలని షరతులు విధించడం బాధాకరం. వడ్డీ కట్టడానికే ఆపసోపాలు పడుతున్న అన్నదాత అసలు, వడ్డీ కలిపి ఒకేసారి ఎలా చెల్లించగలరు? బ్యాంకుల ఎదుట బకాయిదారుడిగా ముద్రపడాలా? కూటమి సర్కార్ వదిలిన అప్పుల అస్త్రానికి విరుగుడు కనిపెట్టేది ఎవరో? రైతన్న కష్టానికి విలువ లేకపోవడం బాధాకరం.

– బెందాళం పద్మావతి, రైతు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి

పునరాలోచన చేయాలి..



నేను 10 ఎకరాల్లో కొబ్బరి, జీడి సాగుచేస్తున్నాను. గత ఏడాది రూ.2లక్షల పంట రుణం బ్యాంకులో తీసుకున్నాను. మే మూడో వారంలో రెన్యువల్ చేసుకోవాలి. రూ.రెండు లక్షల అసలు, వడ్డీ రూ.14000 కలిపి మొత్తం కడితేనే లోన్ రెన్యువల్ అవుతుందని చెబుతున్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో ఆదాయం పూర్తిగా పడిపోయింది. ఇంత భారీ మొత్తం సమీకరించడానికి ప్రైవేట్ అప్పు ఒక్కటే మార్గం. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– ఎన్ని అశోక్, రైతు, చండీపురం, కవిటి మండలం

కొత్త నిబంధనలు..



రైతులు వ్యవసాయ సాగు ఖర్చుల నిమిత్తం తీసుకునే పంట రుణాల విషయంలో ఈ ఏడాది కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. అసలు, వడ్డీ కలిపి చెల్లించాలి. ఒక్క రోజు తర్వాత ఈ రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేసి కొత్త రుణం చెల్లింపులు జరపాలి. ఈ విషయంలో అన్ని బ్యాంకుల్లో నిబంధన ఒకటే.

– బి.సూర్యకిరణ్, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్, శ్రీకాకుళం

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- లాభసాటి ఉత్పత్తులపై దృష్టి సారించండి
- నైరా గ్రామ సందర్శనలో కలెక్టర్

శ్రీకాకుళం రూరల్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సంసిద్ ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని నైరా గ్రామంలో గురువారం పర్యటించారు. స్థానిక సచివాలయంలో అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖలపై సమీక్షించారు. స్థానిక రైతులు పండిస్తున్న పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధిపై ఆరా తీశారు. పాడిపంటలు, వ్యవసాయ ఉత్పత్తులు మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంపీడీఓ బి.శైలజ, నైరా సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఏఈపై కలెక్టర్ ఆగ్రహం..

ఎలక్ట్రికల్ ఏఈపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో సూర్యఘర్ పథకానికి ఎన్ని కనెక్షన్‌లు ఏర్పాటు చేశారని, విద్యుత్ కెపాసిటీ, ప్రతిపాదనలు ఏమేరకు నిర్వహించారని ప్రశ్నించగా ఏఈ సమాధానం చెప్పలేకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఏఈని సస్పెండ్ చేయాలంటూ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అపస్మారక స్థితిలో విశ్రాంత ఉద్యోగి

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం ఓ ప్రయాణికుడు దుస్తులు లేకుండా అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని ఆర్టీసీ ఎస్ఎం ఎంపీ రావు గమనించారు. వెంటనే కాంప్లెక్స్ ఔట్‌పోస్ట్ హెచ్‌సీ ఎస్.శ్రీనివాసరావుకు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని వివరించారు. ఆయన వచ్చి పక్కనే ఉన్న దుస్తులను పరిశీలించగా ఆధార్ కార్డు, ఫోన్ నంబరు లభించాయి. వాటి ఆధారంగా కంచిలి మండలం పెద్దపోలేరు గ్రామానికి చెందిన తులసీదాస్ వెంకటస్వామి మల్లపురెడ్డిగా గుర్తించారు. విశ్రాంత ఉద్యోగి అని, కుటుంబ సభ్యులు ముంబైలో ఉంటున్నట్లు తెలుసుకుని వారికి సమాచారం అందించారు. ఇటీవల కంచిలి మండలం పెద్దపోలేరులో జరిగిన పండగలకు వచ్చి తిరుగు ప్రయాణంలో అపస్మారక స్థితికి చేరుకున్నట్లు గుర్తించి 108 రిమ్స్‌కు తరలించారు. ఆర్టీసీ సెక్యూరిటీ గార్డు జి.రామారావు తదితరులు ఉన్నారు.



వెంకటస్వామిని 108 అంబులెన్సులోకి ఎక్కిస్తున్న దృశ్యం

18 కేజీల గంజాయి పట్టివేత

కాశీబుగ్గ : పలాస రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి 18 కేజీల 550 గ్రాముల గంజాయితో ఓ వ్యక్తి పట్టుబడినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. గురువారం కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సుజిత్ సూర్జియా అనే వ్యక్తి గుణుపూర్ నుంచి పలాస మీదుగా బరంపురం వెళ్లే ఉమా ఎక్స్‌ప్రెక్స్ బస్సుకు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. వ్యసనాలకు బానిసయ్యాడు. పర్లాకిమిడికి చెందిన పుస్కో పారిచా అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పారిచా తాను ఇచ్చే గంజాయిని ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేయమని సుజిత్‌కు చెప్పగా అందుకు అంగీకరించాడు. ఈ క్రమంలో మహారాష్ట్రకు 18.550 కేజీల గంజాయిని తరలిస్తుండగా పలాసలో కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బంది పట్టుకున్నారు. సుజిత్‌తో వచ్చిన మరో ఇద్దరు పరారయ్యారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

చనిపోయిన వ్యక్తికి సీపీఆర్



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

- మృతుడి కుటుంబీకుల ఆరోపణ
- గ్రామస్తులతో కలిసి ఆస్పత్రి ఎదుట ధర్నా

శ్రీకాకుళం క్రైమ్ : గత నెల 29న రోడ్డు ప్రమాదానికి గురై మెడీకవర్ ఆస్పత్రిలో చేరిన రణస్థలం మండలం కొండములగాం గ్రామానికి చెందిన కొంద్రు త్రినాధరావు (32) చికిత్స పొందుతూ మృతి చెందినప్పటికీ ఆ విషయం బయటకు చెప్పకుండా చికిత్స పేరుతో లక్షలు రూపాయలు కట్టించుకుని మోసం చేశారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు బాధిత యువకుడి బంధువులు, గ్రామస్తులు జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రి వద్ద గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం ఒకటో, రెండో పట్టణ సీఐలు పైడపునాయుడు, ఈశ్వరరావు, ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్, శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము, ఆమదాలవలస ఎస్ఐ, స్పెషల్‌బ్రాంచి, ఇంటెలిజెన్సు పోలీసులు ఆసుపత్రి వద్ద మోహరించారు. అంతకు ముందు బాధితులు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా దళిత ఐక్య వేదిక కమిటీ సభ్యుడు నందేశ్వరరావు మాట్లాడుతూ యువకుడు చనిపోయినా విషయం చెప్పకుండా మందులు, వైద్యం పేరిట రూ.లక్షల్లో కట్టించుకోవడం దారుణమన్నారు. మృతుడి తల్లి తవిటమ్మ మాట్లాడుతూ డబ్బులు కట్టించుకుని అన్యాయంగా తన బిడ్డను చంపేశారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు. మృతుడి తండ్రి అప్పారావు మాట్లాడుతూ ఇన్ని రోజులూ ఫర్వాలేదని చెప్పారని, తీరా దగ్గరికి వెళ్లి చూశాక కొడుకు చనిపోయారని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబీకురాలు ఉష మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తికి సీపీఆర్ చేశారని ఆరోపించారు. నాలుగు లక్షలు ఖర్చయ్యిందని, కలెక్టర్, ఎస్పీ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

రైలు ఢీకొని యువకుడికి గాయాలు



యువకుడిని తీసుకెళ్తున్న 108 సిబ్బంది

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఎల్‌సీ గేట్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా ఆసుపత్రి రిమ్స్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేడు జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ : నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న నెహ్రూ యువకేంద్రం ప్రాంగణం వేదికగా శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, నవత ట్రాన్స్‌పోర్టులో వివిధ ఉద్యోగాల భర్తీకి 18 నుంచి 46 ఏళ్ల స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. టెన్త్‌క్లాస్ పాస్/ఫెయిల్, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ చదివిన వారు ఉదయం 10 గంటలకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు.

బస్సు ఆగింది..కష్టమే మిగిలింది..



శ్రీకాకుళం నుంచి బందరువానిపేట బయలుదేరిన ఆర్టీసీ బస్సు గురువారం సాయంత్రం గారలో మొరాయించింది. డ్రైవర్ ప్రయత్నించినా ఇంజిన్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు దిగి ముందుకు తోశారు. అయినా బస్సు స్టార్ట్ కాకపోవడంతో ఉసూరుమంటూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

– గార

రోగులు ఫుల్లు.. వరండాలోనే సేవలు



సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ఆస్పత్రులకు రోగుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. ఈ క్రమంలో కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో గురువారం ఔట్‌పేషెంట్ల సంఖ్య 200కు చేరింది. ఇన్‌పేషెంట్లుగా 25 మంది వైద్యసేవలు పొందుతున్నారు. దీంతో కొందరు ఆస్పత్రి వరండాలోనే బెడ్‌లపై సెలైన్లు ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– కొత్తూరు

రూ.కోట్లు వృథా.. తీరని వ్యథ!



కడగండి రిజర్వాయర్

- చుక్కనీరివ్వని కడగండి రిజర్వాయర్
- రైతులకు తప్పని ఇక్కట్లు
- స్పందించని పాలకులు, అధికారులు

ఎల్.ఎన్.పేట :

కడగంటి జలాశయం.. రెండు మండలాల రైతుల చిరకాల స్వప్నం. ఈ జలాశయం నిర్మాణం పూర్తయి రెండు దశాబ్దాలు కావస్తున్నా కుడి, ఎడమ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో కళ్ల ఎదుటే నీరు వృథాగాపోతున్నా ఏమీ చేయలేని దయనీయ పరిస్థితిలో రైతులు ఉన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని పాలకులకు, అధికారులకు వేడుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునే వారేరీ?


ఎల్.ఎన్.పేట మండలం జంబాడ–బొర్రంపేట గ్రామాల మధ్య కొండల మధ్య నుంచి కడగండి గెడ్డ ప్రవహిస్తుంటుంది. కొండల్లో కుండపోతగా వర్షం కురిస్తే కడగండి గెడ్డ వారం పాటు నిండుగా ప్రవహిస్తూ దిగువ ప్రాంతానికి వృథాగా వెళ్లిపోతుంది. ఈ నీటిని ఒడిసిపట్టి పంట పొలాలకు అందిస్తే వందల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని, రెండు పంటలను పండించుకోవచ్చని భావించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2005 జూలై 20న జలయజ్ఞంలో భాగంగా 'నీటి పారుదల శాఖ ప్రత్యేక పరిశోధనా విభాగం, ఐఆర్‌డీఎఫ్–9'లో రూ.195.16 లక్షలు (సుమారు రూ.2కోట్లు) నిధులు మంజూరు చేశారు. 580 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 81 ఎకరాల్లో చేపట్టిన జలాశయం నిర్మాణం పనులు 2007 నాటికి పూర్తి చేశారు. కుడి, ఎడమ కాలువ నిర్మాణం కోసం 2008లో టెండర్లు పిలిచారు. భూసేకరణ చేయకపోవటంతో కాలువ పనులు నిలిచిపోయాయి. 2009లో వైఎస్సార్ మరణానంతరం రిజర్వాయర్‌ను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

580 గ్రామాలకు సాగునీరు..

కడగండి జలాశయంకు కుడి, ఎడమ కాలువల నిర్మాణం పూర్తయితే ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి మండలాల్లోని 580 గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఎడమ కాలువ పరిధిలో ఎల్.ఎన్.పేట మండలం జంబాడ, వలసపాడు, బొర్రంపేట, ముంగెన్నపాడు, కరకవలస, మల్లికార్జునపురం, శ్యామలాపురం, కుశమల పాడు రెవెన్యూ గ్రామాల్లోని పంట భూములకు సాగునీరు అంతుంది. కుడి కాలువ పరిధిలో ఎల్.ఎన్.పేట మండలం వలసపాడు, బొర్రంపేట, జంబాడ, సరుబుజ్జిలి మండలంలోని గోనెపాడు, అమృతలింగానగరం, బప్పడాం, సరుబుజ్జిలి, కూనజమ్మన్నపేట తదితర గ్రామాలకు సాగునీరు అందుతుంది.

నిధులున్నా నిర్లక్ష్యం..

రిజర్వాయర్‌కు కుడి, ఎడమ కాలువల నిర్మాణంతో పాటు రైతుల వద్ద సేకరించి భూమికి పరిహారం చెల్లించాలని రైతులు అనేక ఫిర్యాదులు చేశారు. దీంతో గతంలో రూ.4.06 కోట్లు మంజూరు చేశారు. వీటిలో రూ.1.45కోట్లు భూసేకరణ కోసం, రూ.1.72 కోట్లు, కాలువల నిర్మాణం కోసం మిగిలిన నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. రిజర్వాయర్ లోపలి భాగంలో భూములు ముంపు బారిన పడుతున్నాయని, వాటిని ముంపు నుంచి తప్పించేందుకు గట్టు పెంచేందుకు రూ.89 లక్షలు ఖర్చు చేశారు. మిగిలిన పనులు గాలికి వదిలేశారు.



అసంపూర్తిగా వదిలేసిన కాలువ

ఇప్పటికైనా స్పందించాలి..



కడగండి జలాశయం నిర్మాణం పనులు పూర్తి చేసి 20 ఏళ్లవుతుంది. ఇప్పటి వరకు సెంటు భూమికి కూడా చుక్క నీరు అందలేదు. రిజర్వాయర్ నిండినా నీరు వృథాగా పోతుంది. దిగువన పంట భూములు నీట మునిగి రైతులు నష్టపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కాలువల పనులు పూర్తి చేయాలి.

– మామిడి నీలంనాయుడు, రైతు, బొర్రంపేట, ఎల్.ఎన్.పేట